కథ

# నా బాల్యం నాకివ్వండి

పి. సుభాషిణి

పచ్చని పొలాలు, చల్లని గాలి, పరుగులు లేని ప్రశాంతమైన జీవితం... ఆ పల్లెటూరి వాతావరణం అభిషేక్‌కి బాగా నచ్చేసింది. 'అమెరికా వాతావరణానికి పూర్తిగా భిన్నమైన వాతావరణం' మనసులోనే అనుకున్నాడు అతడు.

అంతేకాదు- ఆ గాలి, ఆ నేల, ఆ ఊరు, ఆ ఏరు అతడికి అపురూపమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. నిజానికి తనీ ఊళ్లో పుట్టలేదు. ఈ గాలి పీల్చలేదు. ఈ ఏటి నీరు తాగలేదు. అమెరికాలో పుట్టి అక్కడే పెరిగాడు. బాబాయ్ కూతురు పెళ్లని డాడీ వస్తుంటే ఇండియా చూద్దామని ఆయన వెంట వచ్చాడు. కానీ ఇక్కడ అడుగు పెట్టేవరకూ ఈ గడ్డమీద తనకిలాంటి అనుభూతి కలుగుతుందని తనకే తెలియదు. 'అయినా ఈ చోట తనకీ అనుభూతి ఎందుకు కలుగుతోంది?' అతడు తనను తానే ప్రశ్నించుకున్నాడు. జవాబు తోచింది. 'ఓ మనిషి ఏ చోటయినా పుట్టొచ్చు. అక్కడే పెరగొచ్చు. కానీ అతడి వారసత్వపు తాలూకూ వ్రేళ్లు ఒక చోట ఉంటాయి. ఆ గడ్డ అతడి ముందుతరాల వారు నివసించింది. బంధుమిత్రులు నివసించేది అయి ఉంటుంది. ''ఇది నా దేశం, ఇది నా ఊరు'' అని తను మాత్రమే కాదు పరాయి దేశంలో నివసించబోయే తన తర్వాత తరాల వారూ చెప్పుకోదగిన భూమి ఒక్కటే. మాతృభూమి! భవిష్యత్‌లో అమెరికాలో స్థిరపడే తన వారసులు ఆ దేశాన్ని 'మాతృదేశం' అనలేరు. ''మాది భారతదేశం'' అనే అంటారు. అనవలసి ఉంటుంది.

''అభిషేక్! వెళ్దామా?''

అభిషేక్ తలతిప్పి చూశాడు. రెండడుగుల దూరంలో తన బాబాయ్ కొడుకు రామ్మోహన్ నిలబడి ఉన్నాడు. అతడు తనకన్నా రెండేళ్లు పెద్దవాడు. జీవితంలో మొదటిసారి కలవడమే అయినా ''ఒరేయ్ తమ్ముడూ...'' అనో ''అభిషేక్...'' అనో ఆప్యాయంగా పిలుస్తున్నాడు.

మోటారుగట్టు మీద నుండి లేచి అన్నయ్య వెంట ఊళ్లోకి నడిచాడు అభిషేక్.

ఇద్దరూ ఇల్లు చేరగానే, వరండాలో ఉన్న బాబాయ్ కూతుళ్లు ప్రత్యూష, ప్రసూనలు ''అన్నయ్యొచ్చేశాడు - అన్నయ్యొచ్చేశాడు'' అంటూ వచ్చి అతడిని పట్టేసుకున్నారు.

''అన్నయ్యా! పొలంలో తాటిముంజలు తిన్నావా?'' అడిగింది ప్రత్యూష.

''తిన్నాను''

''ఎలా ఉన్నాయి?''

''బాగున్నాయి''

రామ్మోహన్ నవ్వుతూ చెప్పాడు. ''వాడికి ముంజెల్ని వేలితో తీసుకుని తినడం రాలేదు. ఒక్కో ముంజె తినడానికి ఎంత కష్టపడ్డాడో?''

అభిషేక్ వారందరితో కలిసి హాల్లోకి వెళ్లి అటు చూస్తే అక్కడ తన తండ్రి, బాబాయ్, పిన్ని, అత్తమ్మ, తాతయ్య, బామ్మ... అందరూ నవ్వుకుంటూ మాట్లాడుకోవడం కనిపించింది.

అప్పుడే అతడు తండ్రి ముఖంలోకి పరిశీలనగా చూశాడు. అమెరికాలో ఉన్నప్పుడు ఆయనది ఉరుకుల పరుగుల జీవితం. అక్కడ ఆయన ముఖంలో తను టెన్షన్ మాత్రమే చూసేవాడు. కానీ ఇక్కడ తన వాళ్లందరితో మాట్లాడుతుంటే ఆయనలో ఏదో తెలియని ఉత్సాహం కదలాడుతుందేమో, ముఖంలో ఆనందం, తృప్తి కనిపిస్తున్నాయి.

ఎవరు ఎంత సంపాదించినా ఎన్ని సౌకర్యాలు సమకూర్చుకున్నా తన వారంటూ చుట్టూ ఎవరూ లేనప్పుడు మనిషికి తృప్తి ఏముంటుంది.

మరి ఈ విషయం డాడీకి తెలియదా?

బహుశా కెరీర్ మీద కాన్సన్‌ట్రేషన్ ఉన్నప్పుడు బంధాలు, అనుబంధాలు చాలా మామూలు విషయాల్లా అనిపించొచ్చు. కెరీర్ అన్నది ఒక సర్కిల్ లాంటిదని, ఎంత పరుగెత్తినా చివరికి అక్కడికి చేరుతామని తెలిశాక అప్పుడు అయినవాళ్లందరూ కావాలనిపించొచ్చు.

అభిషేక్ అక్కడే నిలబడి ఉంటే, అతడి తాతయ్య పిలిచాడు. ''ఇలా రారా!''

అతడు తాతయ్యకు దగ్గరగా వెళ్తే ఆయన తనకూ, భార్యకు మధ్య అతడిని కూర్చోబెట్టుకున్నాడు.

తాతయ్య, బామ్మ మధ్య కూర్చుంటే అతడికి మునుపెన్నడూ లేని ఒక అపురూపమైన అనుభూతి కలిగింది. ఆ అనుభూతి నిశ్చింతగా అనిపించసాగింది.

తల్లిదండ్రుల ప్రేమలో గారాబమే కాదు. దండించడమూ ఉంటుంది. కానీ తాతయ్య, బామ్మల ప్రేమలో మురిపెమే తప్ప, కోపానికి తావు లేదు. అందుకే చిన్నపిల్లలు అమ్మా, నాన్నలు కసురుతుంటే తాతయ్య, బామ్మల దగ్గరకు చేరుకుంటారు.

ఈ విషయం తనకు ఇండియాకొచ్చి తాతయ్య, బామ్మలను చూశాకే అర్థమయింది.

ప్రమోద్‌కుమార్ వాళ్ల మాటలు వింటూ అలాగే ఉండిపోయాడు.

★ ★ ★

పెళ్లికి వారం రోజుల ముందే బంధుమిత్రుల రాక మొదలయింది. ఇల్లంతా ఒకటే సందడి.

పెళ్లిసందడి!

పలకరింపులు, పరామర్శలు, అలంకరణలు, ఆడంబరాల ప్రదర్శనలు చేసే వాళ్లకి చేతి నిండా పని, తప్పించుకుని తిరిగేవాళ్లకు కావల్సినంత విశ్రాంతి, తిండిపోతులకు రుచికరమైన తిండి, పేకాటరాయుళ్లకు కోరుకున్నంత మంది జోడీ...

అభిషేక్ అమెరికాలో ఒకటీ, రెండు పెళ్లిళ్లకు మాత్రమే హాజరయ్యాడు. కానీ ఇలాంటి పెళ్లిని చూడటం ఇదే మొదటిసారి. భారతదేశంలోని పెళ్లిళ్ల గురించి ఎప్పుడైనా తండ్రి తనకు చెపుతుంటే, అంతగా పట్టించుకునే వాడు కాదు. వినీవిననట్లు ఊరుకునే వాడు.

కానీ ఇప్పుడు చూస్తుంటే భారతదేశంలోని 'పెళ్లి సందడి' వెనుక ఉండే గొప్పతనం అర్థమవుతోంది.

ఈ దేశంలో ఒక ఇంట్లో పెళ్లి జరుగుతుంటే, బంధుమిత్రులంతా ఆ ఇంట చేరుతారు. ''మీ వెంట మేమున్నామంటూ'' అన్ని పనులు నెత్తిన వేసుకుని చేసేస్తారు. తమ బంధుమిత్రులందరితో సరదాగా గడుపుతారు. తమ దగ్గరున్న తృణమో, పణమో వధూవరులకిచ్చి ఆశీర్వదిస్తారు.

ఎంత గొప్ప సాంప్రదాయం!

ఈ సాంప్రదాయ వారసత్వ సంపదకు తను వారసుడు కదూ!

కానీ.. మనసులో ఏదో చిన్న ఇబ్బంది కర భావం కదలాడుతోంది.

ఆ ఇబ్బందికర భావం పక్కన పెడితే ఆ పెళ్లిలో తనే సెంటరాఫ్ అట్రాక్షన్ అయిపోయాడన్న విషయం అర్థమైపోతూనే ఉంది.

పెళ్లికూతురుగా తయారవుతున్నప్పుడే ప్రత్యూష అతడిని పక్కకు తీసుకెళ్లి చెప్పింది. ''అన్నయ్యా! నువ్వు వెంటనే అమ్మ దగ్గరకెళ్లి దిష్టి తీయించుకో''

''దిష్టా?... అంటే?''

''ఎక్కువ మంది చూపులు ఎవరి మీదయితే ఉంటాయో, వాళ్లకు దిష్టి తగులుతుంది.''

''ఇప్పుడు నా మీద ఎవరి చూపులున్నాయి?''

ప్రత్యూష నవ్వును బిగపట్టుకుంటూ చెప్పింది. ''ఇక్కడున్న పెళ్లికాని ఆడపిల్లలందరి కళ్లూ నీ మీదే ఉన్నాయి''

''పెళ్లికాని ఆడపిల్లల కళ్లా?! నా మీద...'' అంటూ అతడు చప్పున ఆ గదిని పరికించి చూస్తుంటే

అప్పటివరకూ అతడినే చూస్తున్న ఆడపిల్లలందరూ తడబడి చూపులు మరల్చుకున్నారు.


మరోవైపు తన తండ్రిని మరికొందరు యధాలాపంగా అడిగినట్లు- ''మీ అబ్బాయికి పెళ్లెప్పుడు చేస్తారు?'' అని అడిగారట. ఆయన కూడా యధాలాపంగానే ''మరో రెండు మూడేళ్లలో చేసేయాలి'' అని అన్నాడట. వాళ్లల్లో కొంతమంది తమకు తోచిన సంబంధాలు చెప్పడమూ తనకు తెలిసింది.

ఆడపిల్లల ఓరచూపులు, పెళ్లిసంబంధాలు ఎలా ఉన్నా ఆ పెళ్లిసందడి అతడి జీవితంలో మరపురాని మధురానుభూతిని మిగిల్చింది.

★ ★ ★

పెళ్లిసందడి తగ్గాక అభిషేక్ తండ్రితో కలిసి ఈ దేశంలోని చూడదగ్గ ప్రదేశాలు చూడటానికి వెళ్లాడు.

తమిళనాడు, కేరళ చూడటానికి వారం రోజులు సరిపోగా అక్కడ



నుండి విమానంలో ఢిల్లీ చేరుకుని ఆగ్రా, రాజస్థాన్‌లు కూడా చూసేసి పల్లెకు చేరుకునేసరికి పదిహేను రోజులు పూర్తయిపోయాయి.

ఇండియా రావడానికి పెట్టుకున్న నెలరోజుల సెలవు అయిపోయింది. ఎన్ని రోజులున్నా తామీ దేశానికి అతిథులే.

వారిద్దరూ తిరిగి అమెరికా వెళ్లడానికి తయారవుతుంటే ఆ ఇంట్లోని వారంతా బాధగా ముఖం పెట్టారు.

'మళ్లీ ఎప్పటికి ఏ కార్యం వస్తుందో- మనం ఎప్పటికి కలుసుకుంటామో... ఒకవేళ కలిసినా అప్పటికి ఎవరుంటారు.. ఎవరు పోతారో!'

'తన వాళ్లు వెళ్లగలిగినంత దూరంలో ఉంటే పర్వాలేదు. ఒకసారి వెళ్లి చూసి రావచ్చు...వెళ్లలేనంత దూరమయితే?!...'

దూరం పెరిగే కొద్దీ మనసులోని భారమూ అదే స్థాయిలో పెరుగుతుందన్నది నిజం.

తన తండ్రికి ఆ వీడ్కోలు ఎలాంటి బాధను కలిగిస్తుందో తెలియదు గానీ, తను మాత్రం చాలా చాలా బాధపడిపోతున్నాడు.

'అమెరికా వాతావరణంలో తనకు చిన్ననాటి నుండి ఇలాంటి అభిమానాలు ఆప్యాయతలు తెలియవు.

## కొత్తదనం

**సినిమాల్లో పాత్రలకీ, నిత్యజీవితంలో జీవనవిధానానికీ తేడా ఎంతో ఉంటుంది. అందాలతార భూమిక తనని ప్రేక్షకులు కలకాలం గుర్తుంచుకునేలా మంచి పాత్రల్ని చేయాలనుకుంటోందిట. ఇంతకీ అసలు సంగతి ఏమిటంటే ఈమెకొత్తగా నటించే సినిమాలో మురికివాడల్లో నివసించే అమ్మాయి పాత్ర పోషిస్తోంది. ఈ పాత్ర సహజత్వం ఉట్టిపడేలా ఉండేందుకు గాను ముంబైలోని ఓ మురికివాడలో ఆమె రోజూ కొంతసేపు గడుపుతోంది. ఈ ఆలోచన ఆమెకి ఎవరి ద్వారా వచ్చిందో?**

అక్కడ తన ఇరుగుపొరుగు అమెరికన్స్‌తో స్నేహం ఉండొచ్చు. అభిమానం, ఆప్యాయతలు ఉండవు. ఎప్పుడయినా తెలుగువారు పరిచయమయినా, పలకరింపులుంటాయి గానీ ఎక్కువగా కలిసి తిరగడమూ ఉండదు. ఇక బంధువులు రక్త సంబంధీకులు అన్నమాట పూర్తిగా మరిచిపోవాలి.

ఆ బాధ మనసులో మెలిపెడుతుంటే, అభిషేక్ తాతయ్య, బామ్మ, బాబాయ్, పిన్ని, అత్తమ్మ, అన్నయ్య, చెల్లెళ్లు అందరి దగ్గర నుండి వీడ్కోలు తీసుకున్నాడు.

హైదరాబాద్‌లో విమానం ఎక్కాక కొడుకు దిగులుగా ఉండడం చూసి రాజగోపాల్ అడిగాడు. ''ఏమిరా అలా ఉన్నావ్?''

అతడు తల తిప్పి తండ్రి ముఖంలోకి చూశాడు. కొద్దిగా తటపటాయించాక అన్నాడు. ''డాడీ! నేనో మాట అడుగుతాను ఏమీ అనుకోవుగా.''

రాజగోపాల్ అతడికేసి కొద్ది క్షణాలు చిత్రంగా చూశాక చెప్పాడు. ''ఏమీ అనుకోనులే చెప్పు.''

అభిషేక్ చెప్పాడు. ''డాడీ! బంధుమిత్రుల కన్నా కెరీర్ ముఖ్యమని మీరు అమెరికా వెళ్లిపోయారు. బాగానే ఉంది. కానీ మీ కడుపున పుట్టిన నేను కెరీర్‌తోపాటు అభిమానాలు, ఆప్యాయతలు అవసరమనే అనుకుంటున్నాను.

తాతయ్య, బామ్మల ప్రేమ, బాబాయ్, పిన్నిల ఆప్యాయత, అన్నా చెల్లెళ్ల అనురాగం ఇవన్నీ నాకు చిన్ననాటి నుండి లేవు డాడీ! నన్ను కని పెంచిన మీకు నా మీద అన్ని హక్కులు ఉన్నాయి. కాదనను. అయితే...నా బంధుమిత్రులు ఇంతమంది అభిమానం, ఆప్యాయతలు పంచడం నుండి నన్ను దూరంగా తీసుకెళ్లిపోవడం ఎంతవరకూ న్యాయం?... మీరే చెప్పండి?''

కొడుకు ప్రశ్నలో న్యాయం ఆ తండ్రి గుండెను కదిలించింది. కానీ తనిప్పుడేం చేయగలడు?



పాతికేళ్లను వెనక్కు తీసుకెళ్లి తాతయ్య, బామ్మల ఒడిలో పడుకుని పేదరాసి పెద్దమ్మ కథలు వినే బాల్యాన్ని తన కొడుకుకు తను తిరిగి ఇవ్వలేడు.

అందుకే ఆయన పెదవులు బిగపట్టి, తల తిప్పుకుని, కనిపిస్తున్న మబ్బులకేసి చెమర్చిన కళ్లతో చూడసాగాడు.